క్లుప్తంగా

వాక్సినేషన్‌తో పశువులకు వ్యాధుల నుంచి రక్ష



ముదిగేడులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

సంజామల: పాడి రైతులు పశువులకు సకాలంలో వాక్సినేషన్ వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు అన్నారు. మండల పరిధిలోని ముదిగేడులో వైస్ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పశు వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్‌తో పశువులకు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్య ఇబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువుల ఆరోగ్యంపై రైతులకు సలహాలు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు



గాయపడిన ఈశ్వర్

బేతంచెర్ల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గోడను ఢీకొని స్కూటరిస్టు గాయపడిన ఘటన గురువారం పట్టణ సమీపంలోని కర్నూలు రహదారి అయ్యల చెరువు వద్ద చోటుచేసుకుంది. డోన్ పట్టణానికి చెందిన ఈశ్వర్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై కర్నూలుకు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. ఈశ్వర్ కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కోవెలకుంట్ల: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిలను ఎక్కిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

ఇష్టంతో చదివితే విజయం సొంతం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: విద్యార్థి దశలో సమయం చాలా విలువైందని, సమయాన్ని వృథా చేసుకోకుండా ఇష్టంతో చదివితే విజయం సొంతం అవుతుందని సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేష్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.

బాలరాముడికి ప్రత్యేక పూజలు



సీతారాముల విగ్రహాల ఎదుట జ్యోతులు వెలిగించిన భక్తులు

డోన్: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాములకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న సీతారామ, లక్ష్మణ, హనుమాన్ సన్నిధిలో హారతి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ, ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు, రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



హారతులు ఇస్తున్న మహిళా భక్తులు

దర్జీ బతుకుల్లో దర్జా మాయం

- రెడీమేడ్ రాకతో టైలర్లకు కష్టాలు
- గత ప్రభుత్వ హయాంలో జగనన్న చేదుడుతో భరోసా
- ఆదుకోని కూటమి ప్రభుత్వం



వెలవెలబోతున్న టైలరింగ్ షాపు

కొలిమిగుండ్ల: దుస్తులతో మనిషికి అందం, హుందా తనం లభిస్తుంది. వస్త్రానికి ఓ ఆకృతినిచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దేది దర్జీలు. కాలక్రమేణా మార్కెట్‌లోకి పలు ఫ్యాషన్లు, డిజైన్లతో పాటు రెడిమేడ్ దుస్తుల రాకతో టైలర్లకు ఉపాధి కరువైంది. కుల వృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. గతంలో పండుగలు, శుభకార్యాలు, ఇతర ఫంక్షన్‌ల సమయంలో టైలర్లకు చేతినిండా పని ఉండేది. కొత్త బట్టలు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూకడుతుండేవారు. రెడీమేడ్ దుస్తుల రాకతో టైలర్ల జీవితాలను ఆగమ్య గోచరంలోకి నెట్టేశాయి. యువత, మధ్య వయసు వారు ఎక్కువ భాగం టీషర్టులు, జీన్స్‌ప్యాంట్లు ధరిస్తున్నారు. మిగిలిన కొంత మంది మాత్రమే టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకుంటున్నారు. ప్రస్తుతం పండుగల సమయంలో సైతం పెద్దగా పనులు లేని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు ఉగాది పండుగ సమయంలో ఇంటిల్లి పాది కొత్త బట్టలు తెచ్చుకొని కుట్టించేవాళ్లు. టైలర్లకు అన్నం తినే సమయం ఉండేది కాదు. పండుగ ముగిసిన నెల రోజుల వరకు పని ఉండేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

వెలవెలబోతున్న టైలర్ షాపులు

బట్టలు కుట్టించుకునే జనాలతో రద్దీగా ఉండే టైలర్ షాపులు నేడు వెలవెలబోతున్నాయి. షాపుకు ఎవరూ వస్తారా అని ఎదురు చూసే పరిస్థితులు ఏర్పడ్డాయని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది దర్జీలు ఆయిల్ మిషన్‌లను పక్కకు పెట్టి ఆధునాతన విద్యుత్‌తో పనిచేసే మిషన్‌ల వాడకం చేస్తున్నారు. పనులు సరిగ్గా లేక గది అద్దె, విద్యుత్ చార్జీలకు సరిపడే పని రావడం లేదని వాపోతున్నారు. చాలా మంది వృత్తిని వదిలేసి ఇతర పనులకు వెళుతున్నారు.

ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం జగనన్న చేదోడు అనే పథకం అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. టైలర్లకు ఈ పథకం కొంత మేర వెసులుబాటు కల్పించింది. ప్రతి విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి, కుట్టు కూలీ డబ్బులను తల్లుల ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. యూనిఫాం ప్రభుత్వం కుట్టించి ఇవ్వకుండా గుడ్డ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు చాలా వరకు పని లభించింది. ఒక రకంగా అప్పట్లో టైలర్లకు చాలా మేలు జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం గతంలో మాదిరిగానే విద్యార్థులకు క్లాత్ ఇస్తే కొంత వరకైనా తమకు ఉపాధి లభిస్తుందని టైలర్లు అభిప్రాయపడుతున్నారు.

పనులు లేకుండా పోయాయి



రెడీమేడ్ వస్త్రాల రాకతో పనులు లేకుండాపోయాయి. పండుగల సమయంలో కూడా పనులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇంతకు ముందు పండుగల సమయంలో రాత్రింబవళ్లు పని చేసేవాళ్లం. భవిష్యత్‌లో ఈ వృత్తిలో కొనసాగడం కష్టతరంగా మారుతుంది. గత ప్రభుత్వంలో టైలర్లకు ఇస్తున్న రూ.10 వేలు ఉపయోగపడేవి. ఇప్పుడు అది కూడా రావడం లేదు.

– శ్రీరాములు, టైలర్, కొలిమిగుండ్ల

టైలరింగ్‌పైనే ఆధారం



టైలరింగ్ పని మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. పనులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. చాలా మంది రెడీమేడ్ దుస్తులు వాడడంతో కుట్టించుకునే వారి సంఖ్య తగ్గిపోతున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాం క్లాత్ ఇస్తే టైలర్లకు కొద్ది రోజుల పాటు పని దొరుకుతుంది.

–దస్తగిరి, టైలర్, బనగానపల్లె

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి



అవుకు బాలికల పాఠశాల విద్యార్థినులకు సూచనలిస్తున్న డీఈఓ

అవుకు: ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని నంద్యాల జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం అవుకు మండల పరిధిలోని గుండ్లశింగవరం, అవుకు బాలుర, బాలికల, కస్తూర్బా పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. వసతులు, విద్యా బోధనపై ఆరా తీశారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున సమయ వృథా చేసుకోకుండా బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అవుకు పాఠశాల గత ఏడాది జిల్లా స్థాయిలో 19వ స్థానంలో ఉందని.. ఈ ఏడాది టాప్10లో ఉండేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ-1,2 శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు. కాగా అవుకు కస్తూర్బా గాంధీ పాఠశాలో ఎస్ఓ, సిబ్బంది తీరుపై వస్తున్న ఆరోపణలపై డీఈఓ స్పందించ లేదు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు నేరుగా కాల్ చేయవచ్చని విద్యార్థులకు సూచించారు. కాగా ఎస్ఓకు ఎంఈఓ శ్రీధర్‌రావు మద్దతు ఉండడం వల్లే ఆయనపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చదువుతోనే మార్పు సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల: చదువుతోనే సమాజంలో.. జీవితంలో మార్పు సాధ్యం అవుతుందని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయా గ్రామాల పొదుపు మహిళలతో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పొదుపు గ్రూపుల్లో ఉండి మహిళలు నిరక్షరాస్యులు ఎవరైనా ఉంటే వారందరికీ వలంటీర్ల ద్వారా విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. చదువు నేర్చుకోవడం ద్వారా ఆర్థిక పరమైన అంశాల్లో పట్టు సాధించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం మధు సూదన్ గౌడ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ మధు సూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సిద్ధప్ప గుడి, డ్రైవర్స్ కాలనీ, గొరిపేట పూదోట మఠం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యజమానులు, విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ప్యాపిలి: వ్యవసాయాధికారులు, సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్ లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలో మూడు నెలలుగా జరిగిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ.. వ్యవసాయాధికారులు ఈకేవైసీ, ఈ క్రాప్ బుకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి పరిహారం అందాలంటే ఈకేవైసీ, ఈ క్రాప్ తప్పనిసరి అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ భారతి, వైస్ ఎంపీపీ రాజా రూపారాణి, కో ఆప్షన్ మెంబర్ జలదుర్గం రసూల్, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయాధికారి రాజేశ్, వైద్యాధికారిణి వాణిశ్రీ, పశువైద్యాధికారి విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి

కోవెలకుంట్ల: దళితుల సంక్షేమం, అభివృద్ధికి వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పూర్‌టు రిచ్ అనే వాగ్దానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజంలో చాలా మంది దళితులు ఆర్థికంగా వెనుకబడినవారేనని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాబోయే బడ్జెట్‌లో దళితుల అభ్యున్నతికి నిధులు కేటాయించి ఉచితంగా రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ గురువారం తెలిపారు. వ్యవసాయ, గృహ, విద్యుత్, ఉపాధిహామీ, వైద్య, విద్య, సాగునీరు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పన్నులు చెల్లిస్తేనే పట్టణాభివృద్ధి సాధ్యం

- మున్సిపాలిటీ పరిధిలో రూ.3.30 కోట్ల బకాయిలు
- డోన్‌మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: పట్టణ ప్రజలు సకాంలో పన్నులు చెల్లిస్తేనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని.. మెరుగైన వసతులు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణ వాసుల దాహార్తిని తీర్చేందుకు నిర్వహిస్తున్న రక్షిత మంచినీటి కొళాయి పథకం బకాయిలు రూ.3.30 కోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డీఈ, ఏఈ, సచివాలయ ఉద్యోగులతో గురువారం బకాయిలపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో కొళాయి ద్వారా ఒక ఇంటికి మంచినీరు సరఫరా చేయాలంటే మున్సిపాలిటీకి ప్రతి నెలా రూ.600 ఖర్చు అవుతుందన్నారు. అయితే లాభాపేక్ష లేకుండా ప్రజాసేవలో భాగంగా ప్రతి నెలా ఇంటికి రూ.100 మాత్రమే నీటి రుసుము వసూలు చేస్తున్న సంగతిని గుర్తుచేశారు. ఇప్పటి వరకు 10 వేల కొళాయి కనెక్షన్లకు గాను రూ.3.30 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. వీటిని సత్వరమే వసూలు చేసేలా కార్యచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. సకాలంలో కొళాయి, ఇంటి, ఇతరత్రా పన్నులను చెల్లిస్తేనే మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు బకాయిలను చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. సమావేశంలో డీఈ రఘు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 121 మందికి పరీక్షలు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో గురువారం నాయినపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శశిధర్ పాల్గొని దగ్గు, జలుబుతో పాటు ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి 121 మందికి ఉచితంగా మందులు అందజేశారు.శీతాకాలం కావడంతో సాధారణ వ్యాధులు ప్రబలుతాయన్నారు. పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైన్స్ జీఎం అజ్మల్ అహ్మద్, జియాలజీ డీఎం నాయుడు, నరేష్ పాల్గొన్నారు.

డ్రైవర్ మృతికి ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన లారీ వర్కర్స్ యూనియన్ డ్రైవర్, సీపీఎం కార్యకర్త మాదన్న గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య మాదన్న మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. యూనియన్ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు.

సామూహిక మరుగుదొడ్డి కూల్చివేత



కూల్చివేసిన ప్రదేశంలో నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకుల ఆక్రమణలకు హద్దులు లేకుండా పోతున్నాయి. యర్రగుడిలో 40 ఏళ్ల క్రితం మహిళల కోసం పొగాకు చేను సమీపంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిని కూల్చివేశారు. మరుగుదొడ్డి చెంతనే ఉన్న సొంత స్థలంలో అధికార పార్టీ నాయకుడు గోకులం షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. పక్కనే ఉన్న వాటిని కూలదోసి ప్రహరీ గోడ నిర్మాణం చేసుకుంటున్నారు. మహిళల కోసం గతంలో పంచాయతీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడేమో కొనుగోలు చేసినట్లు చెప్పుకొని కాంపౌండ్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఇటీవలే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు చర్యలు చేపట్టలేదన్నారు. ఊరికి వెలుపల ఉండడంతో ఇప్పటికీ మహిళలు సామూహిక మరుగుదొడ్డిని ఉపయోగిస్తున్నారని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ నరసింహులు

బనగానపల్లె రూరల్: గ్రామ సభల్లో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్డీఓ నరసింహులు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, సిబ్బందితో సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామ సభల్లో రైతులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వేలో వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని తగిన పరిష్కారం చూపాలన్నారు. ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వాహనదారులకు రూ.2.50 లక్షల జరిమానా



వాహనాల తనిఖీ చేస్తున్న ఆర్టీఓ

కొలిమిగుండ్ల: నంద్యాల రవాణ శాఖాధికారి రవిశంకర్ నాయక్ గురువారం కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్, జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీలు చేశారు. ఓవర్‌లోడ్, రికార్డులు లేని ఆరు వాహనాలకు రూ.2.50 లక్షల జరిమానా విధించారు. ఆర్టీఏ అధికారులు తనిఖీ చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న నాపరాళ్లను రవాణ చేసే ట్రాక్టర్, లారీల యజమానులు అప్రమత్తమై డ్రైవర్లకు సమాచారం అందించారు. వాహనాలను పెట్రోల్ బంకులు, ఇతర ప్రాంతాల్లో నిలుపుకున్నారు. అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారని నిర్ధారించుకున్నాక వాహనాలు రోడ్డెక్కాయి. విజిలెన్స్, ఆర్టీఏ అధికారుల దాడులు చేసి వేలాది రూపాయలు జరిమానా విధిస్తుండడంతో వాహనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

తప్పులను తెలుసుకుంటే జీవితం సుఖమయం



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జీలు

డోన్ టౌన్: ఖైదీలు చేసిన తప్పులను తెలుసుకుని సత్ప్రవర్తనతో మెలిగితే జీవితం బాగుంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి లీలా వెంకటశేషాద్రి, డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. గురువారం డోన్ సబ్ జైలును తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖైదీల వివరాలు.. వారి నేరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశాల్లో చేసిన తప్పులను తెలుసుకుని మంచిగా మెలగాలని సూచించారు. అనంతరం బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారా అంటూ అరా తీస్తూ స్వతహాగా న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. బెయిల్ మంజూరు అయిన వారు జామీనుదారులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం సబ్ జైలులో భోజన వసతి, వైద్య సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యారాక్‌లు, జైలు పరిసరాలను పరిశీలించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, లీగల్ అడ్వయిజర్ మాధవస్వామి, కోర్టు సిబ్బంది ఉన్నారు.

సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తాం



సీహెచ్‌సీ డాక్టర్లతో మంత్రి బీసీ

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న 30 పడకలను 50 పడకలకు పెంచుతామని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రికి కావాల్సిన వసతులను సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వివిధ పరికరాలు, మౌలిక వసతుల కోసం రూ. 5 లక్షల సొంత నిధులు అందజేస్తామని ప్రకటించారు. ఆస్పత్రి ఆవరణలో పోస్టుమార్టం గది, రోగులకు తాగునీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్లు నవీన్ కుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్, వెంకటలక్ష్మి, సోఫియా, మ్యాజరిన్, దంతవైద్యుడు గిరీష్, హెడ్‌నర్సు లక్ష్మి, ఇందిరావతి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సోషల్ ఆడిట్ బృందం

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని రాష్ట్ర సోషల్ ఆడిట్ సభ్యులు నాగేంద్ర ప్రసాద్, బాలకోటయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ధరణి టౌన్‌షిప్‌లో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి వచ్చిన నిధుల వినియోగం, ఖర్చులు, క్రీడా పరికరాలు, విద్యార్థుల బల్లలు, ప్రథమ చికిత్స మందులు, కిట్లు, సామాజిక రుగ్మతలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర వాటి గురించి హెచ్‌ఎం అబ్రహంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి పరిశీలించారు. సాంకేతిక పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

మహనీయుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



కోవెలకుంట్ల: నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్వాతంత్ర్య ఉద్యమంలో మహనీయుల త్యాగాలు వెలకట్టలేనివని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం నేతాజీ జయంతిని బనగానపల్లె నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పరంధామ నిలయంలో ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి బోస్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ తోపాటు ఎందరో మహానుభావుల త్యాగఫలితంతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. మాజీ సైనికులు ప్రతాప్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, సహదేవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీపతి, నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అలాగే జమ్మలమడుగు కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. సర్పంచ్ సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, విగ్రహ దాత రామిరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

–అవుకు: మండల కేంద్రంలోని మదర్‌మోడల్ స్కూల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.



కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



బేతంచెర్లలో..

పాఠశాల డైరెక్టర్ రామసుబ్బమ్మ, హెచ్‌ఎం మురళీ మోహన్ పాల్గొన్నారు.

–బేతంచెర్ల: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నేతాజీ జయంతిని నిర్వహించారు.